
సాక్షి తూర్పుగోదావరి

శుక్రవారం । 20 । అక్టోబర్ । 2023



డెల్టాకు నీరు విడుదల

ధవళేశ్వరం: గోదావరి డెల్టా కింద గురువారం తూర్పు డెల్టాకు 4900,మధ్య డెల్టాకు 2600,పశ్చిమ డెల్టాకు 7200క్యూసెక్కుల నీటిని వదిలారు.



అన్నదానానికి విరాళం

గోకవరం: స్థానిక వీరభద్రునిగద్దెలో నిర్వహించే అన్నదానానికి ఆధ్యాత్మిక వేత్త కంబాల శ్రీనివాస్‌రావు, పద్మావతీదేవి దంపతులు గురూరం రూ.1.10 లక్షలు వితరణ చేశారు.

కళాస్ఫూర్తికి పట్టాభిషేకం



వస్త్ర రంగంలో కొత్తపల్లి మండలంలోని చేనేత కార్మికులు చరిత్ర సృష్టిస్తున్నారు. అగ్గి పెట్టెలో పట్టేటంత చీరను నేసిన ఘనత ఉన్న ఉప్పాడ జాంధానీ చీరలు తయారు చేసే కార్మికుల కళా నైపుణానికి ప్రభుత్వం గుర్తింపు ఇచ్చింది. - IIలో▸

న్యూస్‌రీల్

సీహెచ్‌సీ సిబ్బందికి జీతాలు జమ

జగనన్నకు చెబుదాంలో వినతికి స్పందన

నిడదవోలు : జగనన్నకు చెబుదాంలో వినతి సమర్పించిన నిడదవోలు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో శానిటేషన్ సిబ్బందికి ప్రయోజనం చేకూరింది. వీరికి జీతాలు జమ చేసినట్లు డీసీహెచ్‌ఎస్ డాక్టర్ ఎం సనత్ కుమారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలో లయన్స్ ఆడిటోరియంలో బుధవారం నిడదవోలు పట్టణ, మండల పరిధిలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ఎనిమిది మంది తమకు జీతాలు అందటం లేదని జాయింట్ కలెక్టర్ తేజ్‌భరత్, స్థానిక ఎమ్మెల్యే జి. శ్రీనివాసనాయుడుకి వినతిపత్రం అందజేశారు. సంబంధిత ఏజెన్సీతో మాట్లాడి సమస్యను 24 గంటల వ్యవధిలో పరిష్కరించినట్లు ఆమె పేర్కొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా మెరుగైన వైద్యసేవలు

డీసీహెచ్‌ఎస్ డా.సనత్‌కుమారి



కంటి వైద్యసేవలపై ఆరా తీస్తున్న డీసీహెచ్‌ఎస్ డా.సనత్‌కుమారి

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ప్రజలందరూ సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలన్నదే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని డీసీహెచ్‌ఎస్ డా.సనత్‌కుమారి పేర్కొన్నారు. , జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం ద్వారా ప్రజలకు మెరుగైన వైద్యసేవలను అందించడమే లక్ష్యమన్నారు. గురువారం కంబాలపేట అర్బన్ ప్రైమరీ హెల్త్‌సెంటర్‌లో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో ప్రజలకు అందిస్తున్న సేవలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా హెల్ప్‌డెస్క్,నమోదువిభాగం,మందులవిభాగం,రక్తపరీక్షలుకేంద్రం, వైద్యులసేవలను పరిశీలించి పలు సూచనలు చేశారు. ముందుగా వైద్యశిబిరాన్ని మాజీ కార్పొరేటర్ బొంతా శ్రీహరి ప్రారంభించారు. స్పెషలిస్టు వైద్యులు లక్ష్మీనాగేశ్వరి, శివగణేష్, మెడికల్ ఆఫీసర్లు దేవీ ప్రియాంక, సంధ్యలు వైద్యసేవలు అందించారు. ఈ శిబిరంలో 459మంది వైద్యసేవలు అందించగా, 20మందిని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రికి రిఫరల్ చేశారు. ఈకార్యక్రమంలో ఆరోగ్యసిబ్బంది,సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

10,496 మందికి వైద్య సేవలు

రాజమహేంద్రవరం రూరల్: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా 15వ రోజైన గురువారం జిల్లా వ్యాప్తంగా 21 వైద్య శిబిరాలు నిర్వహించారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, నోడల్ అధికారి డాక్టర్ మౌనిక ఈ విషయం తెలిపారు. ఈ శిబిరాల్లో 10,496 మంది రోగులు వైద్య సేవలు పొందారని, 253 మందిని మెరుగైన చికిత్స కోసం ఆరోగ్యశ్రీ ఆసుపత్రులకు రిఫర్ చేశామని పేర్కొన్నారు.

రత్నగిరిపై భక్తుల రద్దీ



సత్యదేవుని దర్శనానికి క్యూ కట్టిన భక్తులు

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుని ఆలయానికి గురువారం భక్తులు పోటెత్తారు. ఉదయం నుంచి వేలాదిగా తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. సుమారు 40 వేల మంది భక్తులు సత్యదేవుని దర్శించినట్లు అధికారులు తెలిపారు. స్వామివారి దర్శనానికి గంట, ప్రత్యేక దర్శనానికి అరగంట సమయం పట్టింది. స్వామివారి వ్రతాలు 1,600 జరిగాయి. సత్యదేవుని దర్శించిన భక్తులు సప్త గోకులంలో గోవులకు ప్రదక్షిణ చేశారు. రావి చెట్టు వద్ద దీపాలు వెలిగించి పూజలు చేశారు. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.40 లక్షల ఆదాయం వచ్చింది. నాలుగు వేల మంది భక్తులకు అన్నదాన పథకంలో ఉచిత భోజన సౌకర్యం కల్పించారు. దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ రమేష్‌బాబు ఏర్పాట్లను పర్యవేక్షించారు. రత్నగిరి సత్యదేవుని సన్నిధికి శుక్రవారం నుంచి ఐదు రోజుల పాటు వేల సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉంది. శుక్రవారం కనకదుర్గ అమ్మవారి జన్మ నక్షత్రం మూల నక్షత్రం కావడం, శని, ఆది, సోమ, మంగళ వారాలు దుర్గాష్టమి, మహార్నవమి, విజయదశమి తగులు, మిగులు సందర్భంగా వేల సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించనున్నారు. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

అన్నదాతకు వరిసిరి

- ప్రభుత్వ చర్యలు, ప్రోత్సాహంతో పెరిగిన దిగుబడులు
- గతేడాది ఖరీఫ్‌లోఎకరానికి 32 బస్తాల దిగుబడి
- ఈ ఏడాదిలో 35 బస్తాలకు వృద్ధి
- ప్రభుత్వం అవలంభించిన విధానాలతో సత్ఫలితాలు
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు



యంత్రాల ద్వారా ధాన్యం కోత నిర్వహిస్తున్న రైతు

సాక్షి, రాజమహేంద్రవరం: సాగునీటి విడుదల.. మూడు పంటల దిశగా ప్రభుత్వ సన్నద్ధత.. సకాలంలో విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల అందజేత.. ఆపై వరుణుడి కరుణ. ఇలా ఖరీఫ్ సీజన్ ఆరంభం నుంచి అనుకూల పవనాలు వీడయంతో 2023 ఖరీఫ్‌లో రికార్డు స్థాయిలో వరి దిగుబడులు వచ్చే అవకాశాలున్నాయన్న అభిప్రాయం వ్యవసాయ అధికారుల నుంచి వ్యక్తమవుతోంది. నాలుగేళ్లుగా ధాన్యం దిగుబడులు ఆశించిన మేర ఉంటున్నా.. గతంతో పోల్చితే ఈ ఖరీఫ్‌లో అత్యధిక దిగుబడులు నమోదయ్యే సూచలు కనిపిస్తున్నాయి. ఈ పరిణామం కర్షకులకు ఎంతగానో ఉపకరిస్తోంది. పంట సాగుకు పెట్టుబడులకు పోనూ తమకు తగిన లాభం మిగులుతుందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కష్టానికి ప్రతిఫలం దక్కుతుందన్న ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో ఇలా..

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి రైతులు, వ్యవసాయ రంగాన్ని గట్టెక్కించేందుకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోంది. దీంతో రైతులు పంట సాగుకు ముందుకురావడమే కాకుండా ఆశించిన మేర దిగుబడులు సాధిస్తున్నారు. జిల్లాలో 2021 ఖరీఫ్‌లో 82,695 హెక్టార్లలో వరి సాగు చేపట్టారు. ఎకరానికి (75 కిలోల బస్తా) 28 బస్తాల ధాన్యం దిగుబడి వస్తే.. 2022 ఖరీఫ్‌లో 73,606 హెక్టార్లలో వరి సాగైంది. ఎకరానికి 32 బస్తాల ధాన్యం దిగుబడి వచ్చింది. అంటే ఏడాది వ్యవధిలో ఎకరం పొలానికి 4 బస్తాలు వృద్ధి చెందింది. 2021 ఖరీఫ్‌లో మొత్తం 4,29,990 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి అందితే.. 2022లో 4,52,368 మెట్రిక్ టన్నులు.. అంటే 22,378 మెట్రిక్ టన్నులు అదనంగా దిగుబడి వచ్చింది.

ఎకరానికి 35 బస్తాలు:

జిల్లా వ్యాప్తంగా ఖరీఫ్ వరి కోతలు ప్రారంభమయ్యాయి. కొవ్వూరు, చాగల్లు, నిడదవోలు, నరేంద్రపురం, కలవచర్ల తదితర ప్రాంతాల్లో ముమ్మరంగా సాగుతున్నాయి. ఆర్‌పీ126 ఫైన్ వెరైటీ ధాన్యం కోతలు జరుగుతున్నాయి. ఇప్పటికే 250 హెక్టార్లకు పైగా కోతలు పూర్తయినట్లు వ్యవసాయ అధికారులు చెప్పారు. ఎకరానికి 35 నుంచి 40 బస్తాల వరకు దిగుబడి అందుతోంది. ఈ రకం ధాన్యానికి బహిరంగ మార్కెట్‌లో ఆదరణ ఉంది. ఫలితంగా వ్యాపారులు పొలాల వద్దకే వచ్చి ధాన్యాన్ని బస్తా రూ.1400లకు కొనుగోలు చేస్తున్నారు. ధాన్యం తరలింపు, సంచులు తదతర ఖర్చులన్నీ వ్యాపారులే భరిస్తుండటంతో రైతులకు పెద్ద ఊరట కలుగుతోంది. ప్రభుత్వం సేకరించే స్వర్ణ, 1100 రకం ధాన్యం కోతలు నవంబర్ ముమ్మరం కానున్నాయి. ప్రస్తుతం వాతావరణం అనుకూలంగా ఉండటంతో 35 బస్తాల దిగుబడి అందే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ వెల్లడిస్తోంది. ఎక్కువ వర్షం పడితే పిలకలు దెబ్బ తగులుతుంది.

కొనుగోలుకు సన్నద్ధం

జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 72,868 హెక్టార్లలో వరి సాగైంది. ఖరీఫ్ వరి కోతలు ప్రారంభమయ్యాయి. ధాన్యం కొనుగోలుకు సన్నద్ధమవుతున్నారు. 300 ఆర్బీకేల ద్వారా సేకరణకు సన్నాహాలు చేస్తున్నారు. ధాన్యం మద్దతు ధర ప్రభుత్వం క్వింటాల్‌కు రూ.143 పెంచింది. సాధారణ రకం ధాన్యం క్వింటాల్ రూ.2,183 గ్రేడ్–ఏ రకం రూ.2,203గా నిర్ణయించింది. 4.49 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేసింది. ప్రస్తుతం దిగుబడి పెరుగుతున్న నేపథ్యంలో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

అనుకూలించిన వాతావరణం

ఏటా మూడు పంటల సాగు ప్రోత్సహించాలనేది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉద్దేశానికి అనుగుణంగా గత ఖరీఫ్‌లో జూన్ 1వ తేదీ నుంచి ఆయకట్టుకు సాగునీటిని విడుదల చేశారు.

- ఫలితంగా ప్రకృతి విపత్తులు, గోదావరి వరద నుంచి పంటను గట్టెక్కించుకునే అవకాశం కలిగింది. ఈ ఏడాది కూడా అదే సంప్రదాయాన్ని కొనసాగించారు.
- మొక్కలు ఆహారాన్ని తయారుచేసుకుని ఏపుగా పెరిగి మంచి దిగుబడులు రావాడానికి కిరణజన్య సంయోగక్రియ బాగా ఉపకరిస్తుంది. సూర్యుని వెలుగు ఎక్కువ సమయం ఉంటే మొక్కలకు అంత అనుకూలం. సెప్టెంబర్ అనంతరం ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఫలితంగా పైరు బాగా కుదురుకుని ఏపుగా పెరిగి దిగుబడులు పెరిగేందుకు దోహదపడింది.
- సాగుకు అవసరమైన సమయంలో ప్రభుత్వం విత్తనాలు సబ్సిడీపై అందజేసింది.
- పంట దిగుబడిలో ఎరువులది కీలక భూమిక పోషించే ఎరువులను సీజన్ ప్రారంభానికి ముందే ఆర్బీకేల్లో అందుబాటులో ఉంచింది.
- జిల్లాలో వ్యవసాయం మీద ఆధారపడి బతుకు బండి లాగుతున్న రైతులు 2,18,171 మంది ఉన్నారు. వీరికి పంట సాగుకు అవసరమైన పెట్టుబడులను రైతు భరోసా పథకం ద్వారా ప్రభుత్వం అందజేయడంతో కర్షకుల్లో ఉత్సాహం నెలకొని కాడిపడ్డారు.
- తెగుళ్ల బెడద నుంచి రైతులకు ఉపశమనం కలిగింది. ప్రధానంగా ఆకుచుట్టు పురుగు బెడద పెద్దగా కనిపించలేదు.
- వెద్ద పద్ధతిలో సాగు చేయడంతో పంటకు ఎలుకల బెడద దూరమైంది.

ఆశాజనకం



ఖరీఫ్–2023 దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయి. ప్రతి మండలంలో 2022 ఖరీఫ్, 2023 ఖరీఫ్‌కు వ్యత్యాసం కనిపిస్తోంది. ప్రస్తుతం ఒకే వైరైటీ ధాన్యం కోతలు జరుగుతున్నాయి. ఎకరానికి 40 బస్తాల వరకు దిగుబడి అందుతోంది. నవంబర్ మొదటి వారం స్వర్ణ, మిగిలిన రకాల ధాన్యం కోతలు ముమ్మరం కానున్నాయి. 35 బస్తాల దిగుబడి వచ్చే అవకాశం ఉంది. ప్రతి ఎకరానికి అదనంగా ధాన్యం అందనుండటంతో రైతులకు ఆర్థిక ప్రయోజనం కలగనుంది.

– ఎస్.మాధవరావు, జిల్లా వ్యవసాయ అధికారి

మండలాల వారీగా వరి సాగు (హెక్టార్లలో)

మండలం	సాగు						
		గోకవరం	5,146	దేవరపల్లి	3,534	పెరవలి	2,955
అనపర్తి	3,727	సీతానగరం	5,413	గోపాలపురం	3,778	తాళ్లపూడి	3,751
బిక్కవోలు	5,916	రంగంపేట	2,842	కొవ్వూరు	4,166	ఉండ్రాజవరం	4,701
కోరుకొండ	5,526	చాగల్లు	3,211	నిడదవోలు	6,636	నల్లజెర్ల	3,809

ఆ నిధులు ఏమయ్యాయి?

- టీడీపీ హయాంలో అభివృద్ధి శూన్యం
- మీడియాతో ఎంపీ భరత్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ భరత్‌రామ్

రాజమహేంద్రవరం రూరల్: అంకితభావంతో ప్రజలకు సేవ చేయలనే సీఎం జగన్‌మోహన్ రెడ్డిని స్ఫూర్తిగా తీసుకొని ఈ నాలుగున్నరేళ్ళలో నగరాన్ని అభివృద్ధి చేశామని ఎంపీ మార్గాని భరత్ రామ్ తెలిపారు. గురువారం రాత్రి మార్గాని ఎస్టేట్స్ ప్రాంగణంలో ఎగ్జిబిషన్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ టీడీపీ హయాంలో అక్రమాలు, దందాలు, కమీషన్లు తప్పిస్తే ఏ ఒక్క పనీ చేయలేదన్నారు. గత పుష్కరాలలో నగర అభివృద్ధికి రూ.2 వేల కోట్లను మంజూరు చేసినట్లు అప్పటి సీఎం చంద్రబాబు ప్రకటించారన్నారు. మరి ఆ నిధులు ఏమయ్యాయో అర్థం కావడం లేదన్నారు. ఎక్కడా అభివృద్ధి జరిగిన దాఖలాలు కూడా లేవన్నారు. రూ.2 వేల కోట్లంటే చిన్న విషయం కాదని, భారీ స్కాం జరిగిందన్నారు. ప్రజాధనాన్ని అడ్డంగా టీడీపీ నేతలు దోచుకున్నారని ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ఈ నాలుగున్నర సంవత్సరాలలో కేవలం రూ.330 కోట్లతో ఏ విధంగా అభివృద్ధి చేశామన్నది ప్రజలే స్వయంగా చూస్తున్నారన్నారు. ఈ సమావేశంలో మార్గాని సురేష్, నగర వైఎస్సార్‌సీపీ మహిళాధ్యక్షురాలు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జగనన్నకు చెబుదాంపై ప్రత్యేక కార్యాచరణ

జిల్లా కలెక్టర్ డా.కె.మాధవీలత



సమీక్షాసమావేశంలో జిల్లా కలెక్టర్ డా.కె. మాధవీలత, జాయింట్‌కలెక్టర్ తేజ్‌భరత్

రాజమహేంద్రవరం రూరల్: జగనన్నకు చెబుదాం మండల స్థాయి కార్యక్రమంపై ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక అమలు చేస్తున్నట్లు కలెక్టర్ మాధవీలత తెలిపారు. ఇందుకోసం కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు చేశామన్నారు. దీని ద్వారా ఎప్పటికప్పుడు అర్జీల స్థితి తెలుసుకుంటున్నామన్నారు. గురువారం సాయంత్రం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్ రెడ్డి విజయవాడ నుంచి వివిధ పథకాల అమలుపై సమీక్ష నిర్వహించారు. స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి కలెక్టర్ మాధవీలత, జేసీ తేజ్ భరత్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా ప్రగతి నివేదిక వివరించారు. జగనన్న ఆరోగ్య సురక్ష కింద ఇప్పటివరకూ 235 మెడికల్ క్యాంపులు నిర్వహించామన్నారు.

గ్రామీణ ప్రాంతంలో 209, పట్టణ ప్రాంతంలో 26 నిర్వహించామన్నారు. 1,12,600 మందికి వైద్య సేవలు అందించామన్నారు. సగటున ప్రతి క్యాంపునకు 401 మంది హాజరవుతున్నారన్నారు. వీరంతా వైద్య సేవలు పొందినట్లు వివరించారు. బడి బయట పిల్లలను స్కూల్ లో జాయిన్ చేసే ప్రక్రియలో భాగంగా 10వ తరగతి ఉత్తీర్ణత సాధించని 7,367 మందిలో 7,072 మందిని తిరిగి జాయిన్ చేసినట్లు పేర్కొన్నారు. ఇంటర్‌లో 2,221 మందిని తిరిగి కాలేజీల్లో చేర్పించామన్నారు. క్షేత్రస్థాయిలో నూరు శాతం ఎన్‌రోల్‌మెంట్ కోసం చర్యలు తీసుకుంటామని వివరించారు. జగనన్నకు చెబుదాం మండల స్థాయి కార్యక్రమాల్లో ఇప్పటి వరకు 684 అర్జీలు స్వీకరించామన్నారు. వాటిలో 345 పరిష్కరించామన్నారు. 333 పరిశీలనలో ఉన్నాయన్నారు.

నేడు జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు

సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం): జిల్లాలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు శుక్రవారం వివిధ గ్రామ, పట్టణ ఆరోగ్య కేంద్రాలలో నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ మాధవీలత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.మండలాల వారీగా దుప్పలపూడి,(అనపర్తి), బలబద్రపురం.2 (బిక్కవోలు), యర్నగూడెం(దేవరపల్లి), వెదురుపా(గోకవరం), గోపాలపురం-3(గోపాలపురం), కడియపులంక-3(కడియం), వాడపల్లి:2 (కొవ్వూరు) , కాటా కోటేశ్వరం(నిడదవోలు), అజ్జరం(పెరవలి), కంబాలచెరువు– 2 (రాజమహేంద్రవరం అర్బన్) , శాటిలైట్ సిటీ–4(రాజమహేంద్రవరం రూరల్) , నరేంద్రపురం(రాజానగరం),నల్లమిల్లి (రంగంపేట) ,రఘుదేవపురం(సీతానగరం),ప్రక్కిలంక(తాళ్లపూడి), వెలగదుపర్రు(ఉండ్రాజవరం)లలో శిబిరాలు జరుగుతాయని పేర్కొన్నారు. ప్రజలు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని కలెక్టర్ కోరారు.

అరుణాచలం గిరి ప్రదక్షిణకు ప్రత్యేక బస్సు

రావులపాలెం: ఏపీఎస్ ఆర్టీసీ రావులపాలెం డిపో నుంచి అరుణాచలం గిరి ప్రదక్షిణ, తిరుమల శ్రీవారి దర్శనానికి నాలుగు రోజుల ప్రత్యేక యాత్ర బస్సు సర్వీసు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ కేడీఎంఎస్ కుమార్ గురువారం తెలిపారు. సూపర్ లగ్జరీ బస్సు నవంబర్ 2న బయలు దేరి గిరి ప్రదక్షిణ అనంతరం 6న రావులపాలెం చేరుతుందన్నారు.



హాజరైన భక్తులు

మహాలక్ష్మీ.. నమోస్తుతే...

సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం) : దసరా మహోత్సవాలలో భాగంగా మహాలక్ష్మీ దేవి అలంకారంలో దుర్గమ్మ దర్శనమిచ్చారు. గురువారం రాజమహేంద్రవరంలోని దేవిచౌక్‌లో మహాలక్ష్మీ దేవి అలంకారంలో దర్శనమిచ్చిన అమ్మవారిని దర్శించుకునేందుకు పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. కుంకుమ పూజలు నిర్వహించారు. ఈ అలంకారంలో అమ్మవారిని దర్శించుకుంటేఐశ్వర్యప్రాప్తి, విజయం లభిస్తుందని భక్తుల విశ్వాసం. శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో అమ్మవారిని రబ్బరు బ్యాండ్లు, బాల్స్‌తో అలంకరించారు. గోదావరి గట్టున శ్రీ ఉమామార్కండేయేశ్వర స్వామి వారి ఆలయంలో శ్రీపార్వతీ అమ్మవారిని శ్రీఅన్నపూర్ణదేవిగా అలంకరించారు.



దేవిచౌక్‌లో శ్రీమహాలక్ష్మీ అమ్మవారి అలంకారంలో

కోట సత్తెమ్మ సన్నిధిలో పూజలు

నిడదవోలు రూరల్: శరన్నవరాత్రుల ఐదో రోజైన గురువారం మండలంలోని తిమ్మరాజుపాలెం కొలువైన కోటసత్తెమ్మ వారి ఆలయ ప్రాంగణంలో అమ్మవారికి 300 మంది దంపతులు సహస్రనామ కుంకుమ పూజలు, చండీపారాయణ, హోమాలు నిర్వహించారు. అమ్మవారిని స్వర్ణాభరణములతో ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. దాతల ఆర్థిక సాయంతో భక్తులకు చక్కెర పొంగళి, దేవస్థానం ఆధ్వర్యంలో పులిహోర ప్రసాద వితరణ చేశారు.వివిధ రూపాల్లో అమ్మవారికి రూ.1,60,210 ఆదాయం సమకూరినట్టు ఆలయ ఈఓ బళ్ల నీలకంఠం (శివ) చెప్పారు.



తిమ్మరాజుపాలెంలో ప్రత్యేక పుష్పాలంకరణ, స్వర్ణాభరణములతో భక్తులకు దర్శనమిస్తున్న కోటసత్తెమ్మ అమ్మవారు

కుల వృత్తుల అభివృద్ధికి ఊతం

- జగనన్న చేదోడు 4వ విడత సాయం జమ
- 13,473 మంది లబ్ధిదారులకు మేలు
- జిల్లాలో రూ.13.47 కోట్ల మేర జమ

సీటీఆర్ఐ(రాజజమహేంద్రవరం): రజకులు, నాయీ బ్రాహ్మణులు, టైలర్లు వృత్తి పనివార్లకు జగనన్న చేదోడు పథకం కింద ఇప్పటివరకూ నాలుగు విడతల్లో ప్రభుత్వం ఆర్థిక సహాయాన్ని అందజేసి అండగా నిచిందని కలెక్టర్ మాధవీలత అన్నారు. గురువారం జగనన్న చేదోడు రాష్ట్ర స్థాయి కార్యక్రమం కర్నూలు జిల్లా ఎమ్మిగనూరులో జరిగింది. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బటన్ నొక్కి లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాలో రూ.10వేలు వంతున జమ చేశారు. ఈ కార్యక్రమానికి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టరేట్ నుంచి ఎంపీ భరత్‌రామ్, రాష్ట్ర గాండ్ల తెలుకుల కార్పొరేషన్ చైర్ పర్సన్ సంకిస భవానీ ప్రియ, రుడా మాజీ చైర్ పర్సన్ షర్మిలా రెడ్డితో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాధవీలత మాట్లాడుతూ జగన్న చేదోడు పథకం కింద జిల్లాలో 13,473 మందికి రూ.13.47 కోట్ల సహాయాన్ని ప్రభుత్వం జమ చేసిందన్నారు. కుల వృత్తులు చేసుకునే కుటుంబాలకు చేదోడుగా నిలవాలని ఆర్థిక సహాయం ఖాతాలోకి జమ చేస్తున్నట్లు తెలిపారు. ఈ మొత్తాన్ని కుల వృత్తుల అభివృద్ధికి వినియోగించుకోవాలని ఆమె ఆకాంక్షించారు. జిల్లాలో ఈ పథకం కింద గత మూడు విడతలుగా 35,616 మంది లబ్ధిదారులకు రూ. 35.61 కోట్లు అందజేసిందన్నారు. ఎంపీ భరత్ రామ్ మాట్లాడుతూ లంచాలకు, వివక్షకు తావు లేకుండా అత్యంత పారదర్శకంగా, గ్రామ, వార్డు సచివాలయాల్లో అర్హుల జాబితా ప్రదర్శించి సోషల్ ఆడిట్ నిర్వహించి మరీ లబ్ధిదారుల ఎంపిక చేస్తున్నారన్నారు. అర్హత ఉన్న అందరికీ సాయం అందిస్తున్నారన్నారు. అర్హులై ఉండి లబ్ధి పొందని వారికి కూడా మరో అవకాశం కల్పిస్తున్నారన్నారు. జూన్, డిసెంబర్‌లలో ఈ లబ్ధిని అందజేస్తున్నారన్నారు. కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి సత్య రమేష్, పలువురు లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.



డెమో చెక్‌ని అందిస్తున్న కలెక్టర్ మాధవీలత, ఎంపీ భరత్ తదితరులు

జగనన్నకు కృతజ్ఞతలు....



నేను బార్బర్ షాప్ నిర్వహిస్తున్నాను. జగనన్న చేదోడు పథకం ద్వారా ఇప్పటివరకూ నాలుగు విడతలుగా ప్రభుత్వం అందించిన ఆర్థిక సాయం నాకు ఎంతో ఉపయోగపడింది. మా అమ్మకు వైఎస్సార్ పెన్షన్ కానుక, పిల్లలకు అమ్మఒడి సాయం వస్తోంది. జగనన్నకు ఎంతో ఋణపడి ఉన్నాము.

– జి. సత్తిబాబుచ రాజానగరం

ఇస్త్రీ సామాన్ల కొనుగోలు...



మా ఊళ్లో ఇస్త్రీ బండి నడుపుకుంటూ జీవనం గడుపుతున్నాను. ఇప్పటివరకూ నాలుగు విడతల్లో జగనన్న చేదోడు ద్వారా రూ.40 వేలు జగనన్న ప్రభుత్వం అందించింది. ఈ ఆర్థిక సహాయంతో మాతో ఎంతో మేలు చేకూరింది. ఇస్త్రీ బండి రిపేర్లు, ఇస్త్రీకి అవసరమయ్యే బొగ్గు వంటివి కొనుగోలు చేసుకుంటున్నాను.

– రేగుల బండ గంగారావు, రాజానగరం

కుటుంబానికి ఆసరా...



శ్రీ లలితా దేవి టైలరింగ్ షాప్‌లో టైలరింగ్ వృత్తి చేసుకుంటున్నాను. టైలరింగ్ వృత్తితో కుటుంబానికి ఆసరాగా నిలుస్తున్నాను. కుటుంబ పోషణ కోసం నిర్వహిస్తు న్న వృత్తికి ఈ నగదు మొత్తం పెట్టుబడి సహాయంగా ఉపయోగపడుతోంది. జగనన్న చేదోడు కింద గత నాలుగు విడతలుగా రూ.10 వేలు చొప్పున ఇప్పటివరకు రు.40 వేలు అందుకున్నాను.

– కత్రి దేవి భవానీ, రాజమహేంద్రవరం

కార్తికేయలో అవకతవకలపై రేపు విచారణ

బోట్‌క్లబ్ (కాకినాడసిటీ): కార్తికేయ కోఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీలో జరిగిన ఆర్థిక అవకతవకలపై శనివారం సహకారశాఖ డిప్యూటీ రిజిస్ట్రార్ కోర్టులో విచారణ జరుగుతుందని సొసైటీ పర్సన్ ఇన్‌చార్జ్ పి దుర్గాప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సహకార చట్టం–51 ప్రకారం ఇప్పటికే విచారణ చేయగా రూ. 21.58 కోట్లు దుర్వినియోగమైనట్లు గుర్తించారు. దీనిపై సివిల్‌కేసు నమోదయ్యిందన్నారు. పలువురు మాజీ డైరెక్టర్లపై పోలీసులు విచారణ చేపట్టారన్నారు.సొసైటీ మాజీ డైరెక్టర్ బాలం విజయకుమార్‌కు పలుమార్లు నోటీసులు పంపినా సమాధానం లేదన్నారు.

నోటీసులు కూడా వెనక్కి వస్తున్నాయన్నారు. ఈ నేపథ్యంలో సహకారశాఖ కమిషనర్ ఆదేశాలు మేరకు సహకారశాఖ డిప్యూటీ రిజిస్ట్రార్ కృష్ణశృతి డీసీసీబీ బ్యాంకులో సహకారశాఖ కోర్టులో విచారణ చేపట్టనున్నట్లు చెప్పారు. సహకార ర్టులో విచారణకు హాజరు కావాలన్న డైరె నోటీసులు పంపినట్లు చెప్పారు.

కళాస్ఫూర్తికి పట్టాభిషేకం

రాష్ట్ర ప్రభుత్వం మూడేళ్లుగా అత్యున్నత అవార్డులను ప్రకటిస్తుంది. వివిధ రంగాల్లో నిష్ణాతులకు తగిన గుర్తింపు ఇస్తుంది. వైఎస్సార్ లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డుల ద్వారా వారికి సముచిత స్థానం కల్పిస్తోంది.. అదే విధంగా ఈ ఏడాది కూడా వివిధ రంగాల్లో లబ్ధప్రతిష్టులు 27 మంది ప్రముఖులను రాష్ట్ర కమిటీ ఎంపిక చేసింది. తమకు తాముగా దరఖాస్తు చేసుకున్న వారిని, జిల్లా కలెక్టర్లు, యంత్రాంగం కుణ్ణంగా పరిశీలించిన అనంతరం ఎంపిక చేసింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆమోదంతో కమిటీ అర్హులను ప్రకటించింది.

- వైఎస్సార్ లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డుకు ఎంపిక
- తూర్పుగోదావరి జిల్లా నుంచి రామబ్రహ్మం
- ఆర్ట్ అండ్ కల్చర్ విభాగంలో 'ఉప్పాడ'



ఉప్పాడ చేనేత సంఘంలో చీరలు విక్రయిస్తున్న సిబ్బంది

పిఠాపురం: వస్త్ర రంగంలో కొత్తపల్లి మండలంలోని చేనేత కార్మికులు చరిత్ర సృష్టిస్తున్నారు. అగ్గి పెట్టెలో పట్టేటంత చీరను నేసిన ఘనత ఉన్న ఉప్పాడ జాంధానీ చీరలు తయారు చేసే కార్మికుల కళా నైపుణ్యానికి ప్రభుత్వం గుర్తింపు ఇచ్చింది. చేనేత ద్వారా రూపుదిద్దుకుంటున్న జాంధానీ చీరలు మహిళా లోకంలో మచ్చుతునకలుగా నిలుస్తూ అనతి కాలంలోనే అంతర్జాతీయ ఖ్యాతిని సంపాదించాయి. ఇప్పటి వరకూ పేటెంట్ హక్కుతో సహా పలు జాతీయ రాష్ట్ర అవార్డులు సొంతం చేసుకున్న ఉప్పాడ కాటన్, సిల్క్‌కు మరో గుర్తింపు లభించింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏటా ప్రతిష్టాత్మకంగా వివిధ రంగాల్లో కృషి చేసిన వారికి అందిస్తున్న వైఎస్సార్ లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డును ఆర్ట్ అండ్ కల్చర్ విభాగంలో కొత్తపల్లి మండలం ఉప్పాడ చేనేత పారిశ్రామిక సహకార ఉత్పత్తి విక్రయ సంఘం సొంతం చేసుకుంది. వందేళ్లకు పైగా చరిత్ర కలిగిన ఉప్పాడ జాంధానీ చీరల తయారీ కార్మికులతో 1938లో ఉప్పాడ చేనేత పారిశ్రామిక సహకార ఉత్పత్తి విక్రయ సంఘం ఏర్పాటు చేశారు. అప్పట్లో 300 మంది సభ్యులతో ఈ సంఘం ప్రారంభించారు. ప్రస్తుతం 200 మందితో కార్యకలాపాలు సాగిస్తున్నారు. ఏటా కొత్త కొత్త డిజైన్లను పరిచయం చేస్తూ కార్మికులకు తోడ్పాటు ఇవ్వడంలో సంఘం ముఖ్య భూమిక పోషిస్తోంది. సంఘం ఆధ్వర్యంలో మగ్గాలపై జాంధానీ చీరలు తయారు చేస్తుండగా, సంవత్సరానికి రూ.14 లక్షల టర్నోవర్ కలిగి ఉంది. ఏ ప్రభుత్వంలోనూ ఇలా గుర్తించి అవార్డులు ఇవ్వలేదని సంఘం ఇన్‌చార్జి అధికారి కె.చేతన్ అన్నారు. ఎన్నో ఏళ్లగా చేనేత కార్మికులకు అండగా నిలిచిన ఈ సంఘానికి ఇన్నాళ్లకు ప్రభుత్వ పరంగా గుర్తింపు లభించిందని సంఘం మేనేజర్ వెంకట సూర్యనారాయణ అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ వచ్చాక నేతన్న నేస్తంతో నేత కార్మికులను ఆదుకోవడంతో చేనేత రంగం మరింత అభివృద్ధి సాధించిందని ఆయన తెలిపారు. ప్రస్తుతం ఉప్పాడ చేనేత పారిశ్రామిక సహకార ఉత్పత్తి విక్రయ సంఘాన్ని అభివృద్ధి పథంలో నడిపించడానికి చర్యలు తీసుకుంటున్నామని, సంఘంలో సభ్యుల సంఖ్యను పెంచుతామన్నారు. ప్రస్తుతం వచ్చిన అవార్డు కార్మికులందరికీ చెందుతుందన్నారు. గతంలో పదుల సంఖ్యలో ఉండే మగ్గాలు ఇప్పుడు వందల సంఖ్యకు చేరుకున్నాయని, చీరల ఉత్పత్తి సైతం గణనీయంగా పెరిగిందన్నారు. సంఘం టర్నోవర్ పెంచడానికి కార్మికులను మరింత ఉత్సాహంగా పని చేయించడానికి ఈ అవార్డు ఉపయోగపడుతుందన్నారు.

'భేతవోలు'కు పురస్కారం



ఆచార్య భేతవోలు రామబ్రహ్మం దంపతులతో సాహితీ అభిమానులు

నల్లజర్ల: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరఫున వైఎస్సార్ లైఫ్ టైం అచీవ్‌మెంట్ 2023కి అవార్డులను గురువారం ప్రకటించారు. తెలుగు భాష- సాహిత్యం విభాగంలో తూర్పుగోదావరి జిల్లా నల్లజర్లకు చెందిన ఆచార్య భేతవోలు రామబ్రహ్మం ఉన్నారు. సాహిత్య రంగానికి ఆయన అందిస్తున్న సేవలకు ఈ అవార్డు రావడంపై ఇక్కడి ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. భేతవోలు రామబ్రహ్మం అవధాన రాజ్యాంగ నిర్మాత. తెలుగు భాషకు ఆయన చేసిన విశేష సేవలకు గాను కేంద్రభాషా సమ్మాన్ పురస్కార్-2021కు ఆయన ఇటీవల ఎంపికయ్యారు. అలాగే 2018లో తెలుగు సాహిత్యానికి చేసిన సేవలకు గాను రాష్ట్రపతి ప్రశంసాపత్రం అందుకున్నారు. నల్లజర్లలో 1948 జూన్ 10న అతి సామాన్య కుటుంబంలో ఆయన జన్మించారు. కష్టాలే తోడుగా ఆయన ప్రాథమిక విద్యాభ్యాసం సాగింది. తర్వాత కొవ్వూరు సంస్కృత పాఠశాలలో భాషా ప్రవీణ చేశారు. ఆంధ్రా విశ్వవిద్యాలయంలో ఎంఏ తెలుగు చదివారు. తర్వాత నాగార్జున విశ్వవిద్యాలయం నుంచి ఆచార్య తూమాటి దోణప్ప పర్యవేక్షణలో తెలుగు వ్యాకరణాలపై సంస్కృత ప్రాకృత వ్యాకరణాల ప్రభావం అనే అంశంపై పీహెచ్‌డీ చేశారు. హైదరాబాద్‌లో వాఙ్మయి త్రైమాసిక పత్రికలో కొన్నాళ్లు పనిచేశారు. అదే పత్రికను బొమ్మూరుకు తీసుకువచ్చి పరిశోధనలో ప్రామాణికతను పాటిస్తూ తెలుగు సాహిత్యానికి విశిష్టమైన సంచికగా రూపొందించడంలో విశేష కృషి చేశారు. 2005లో హైదరాబాద్‌లో కేంద్రీయ విశ్వవిద్యాలయంలో ఆచార్యులుగా చేరారు. అక్కడ రావూరి వెంకటేశ్వర్లు ప్రోత్సాహం, ప్రేరణతో భాషా ప్రవీణ చేశారు. 25 ఏళ్లలో 300 వరకూ అవధానాలు చేశారు. తర్వాత లెక్కలేనన్ని అవధానాలకు సంచాలకత్వం వహించారు. కొత్త గోదావరి వంటి పద్యకావ్యాలే కాకుండా నాటకాలు రాశారు. సాహిత్య వ్యాసాలు, పరిశోధనా గ్రంథాలు రాశారు. సంస్కృత నాటకాలకు వ్యాఖ్యానాలు రాసి ఎనలేని కీర్తి గడించారు. దేవీ భాగవతం వంటి రచన ద్వారా కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు పొందారు. ప్రస్తుతం ఆయన వైఎస్సార్ లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డుకు ఎంపికయ్యారు.

ఇంటర్ ఫెయిల్ విద్యార్థులకు సువర్ణావకాశం

పరీక్ష ఫీజు గడువు పెంపు



ఎస్‌వీవీ సత్యనారాయణరెడ్డి

రాయవరం: ఇంటర్ ఫెయిలైన విద్యార్థులకు పరీక్ష ఫీజు చెల్లించే గడువును పొడిగించినట్లు ఇంటర్ బోర్డు డీవీఈఓ ఎస్‌వీవీ సత్యనారాయణరెడ్డి తెలిపారు. ఈ మేరకు ఇంటర్ బోర్డు కార్యదర్శి సౌరభ్‌గౌర్ నుంచి ఉత్తర్వులు వచ్చాయన్నారు. వచ్చే ఏడాది మార్చిలో జరగనున్న పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు పరీక్ష ఫీజు గడువును నవంబరు 30వ తేదీ వరకూ పొడిగించారన్నారు. ఇంటర్ ఫెయిలైన విద్యార్థులు, మధ్యలో కళాశాల మానివేసిన వారు, జనరల్, ఒకేషన్ కోర్సులు చదివిన విద్యార్థులు జ్ఞానభూమి పోర్టల్ ద్వారా ఫీజు చెల్లించే అవకాశముందన్నారు. నిర్ణీత ఫీజుల మొత్తాన్ని చెల్లించి, పరీక్షలకు హాజరు కావాలన్నారు. ఫెయిలైన విద్యార్థి తిరిగి కళాశాలలో అడ్మిషన్ పొందిన అన్ని పరీక్షలకు హాజరైతే ఎక్కువ మార్కులు వచ్చిన దానిని పరిగణనలోకి తీసుకుంటామన్నారు. అలాగే కంపార్ట్‌మెంటల్, ఫెయిల్ అని కాకుండా ఒకేసారి ఉత్తీర్ణులైనట్లుగా సర్టిఫికెట్ జారీ చేస్తామన్నారు. అలాగే కళాశాలలో తిరిగి అడ్మిషన్ పొందిన విద్యార్థులకు జగనన్న అమ్మఒడి, ఇతర ప్రభుత్వ పథకాలకు అర్హులవుతారన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లలో ప్రవేశం పొందవచ్చన్నారు.

బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్‌గా పీకే రావు



అంబాజీపేట: ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్‌గా అంబాజీపేటకు చెందిన పేరి కామేశ్వరరావు (పీకే రావు) నియమితులయ్యారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి జి.అనంతరాము నుంచి ఉత్తర్వులు అందుకున్నట్లు ఆయన గురువారం తెలిపారు. తనకు చైర్మన్ పదవి రావటంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో పాటు రాష్ట్ర మంత్రులు పినిపే విశ్వరూప్, చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, ఎంపీ చింతా అనురాధ, ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబులకు రావు కృతజ్ఞతలు తెలిపారు.

గణిత ఫోరం అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా మూర్తి, శ్రీరామ్



డాక్టర్ సూర్యనారాయణమూర్తి



పీవీఎల్ఎన్ శ్రీరామ్

అమలాపురం టౌన్: ఆంధ్రప్రదేశ్ గణిత ఫోరం అధ్యక్షుడిగా అమలాపురం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయుడు, గణితావధాని డాక్టర్ టీఎస్‌వీఎస్ సూర్యనారాయణమూర్తి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే ఉపాధ్యక్షుడిగా అమలాపురంలోని కొంకాపల్లి జవహర్‌లాల్ నెహ్రూ మున్సిపల్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు పీవీఎల్ఎన్ శ్రీరామ్ ఎన్నికయ్యారు. ఇటీవల విజయవాడలో ఈ ఎన్నిక జరిగింది. ఇప్పటి వరకూ రాష్ట్ర గణిత ఫోరం గౌరవ సలహాదారునిగా పనిచేసిన డాక్టర్ సూర్యనారాయణ మూర్తి తాజా నూతన కార్యవర్గంలో రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టారు. రాష్ట్ర సంఘ కార్యదర్శిగా పనిచేసిన శ్రీరామ్ ఇప్పుడు ఉపాధ్యక్ష పదవి స్వీకరించారు. గణిత ఉపాధ్యాయులకు తద్వారా విద్యార్థులకు గణిత చిట్కాలు, మెలకువలు చెబుతూ రాష్ట్రాన్ని గణితపరంగా మొదటి స్థానంలో నిలిపేందుకు కృషి చేస్తామని డాక్టర్ సూర్యనారాయణమూర్తి, శ్రీరామ్ తెలిపారు.

సారా విక్రయిస్తే కఠిన చర్యలు

- జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్
- రూ.4.86 లక్షల విలువైన సారా ధ్వంసం



పట్టుబడిన సారా ప్యాకెట్లను పరిశీలిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్, అధికారులు

కిర్లంపూడి: నిండు ప్రాణాలను బలిగొంటున్న సారాను విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ అన్నారు. కాకినాడ జిల్లా పరిధి స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఆధ్వర్యంలో 697 కేసుల్లో పట్టుబడిన రూ.4.86 లక్షల విలువ చేసే 4,050 లీటర్ల సారాను గురువారం కిర్లంపూడి మండలం జగపతినగరం పరిధిలో ధ్వంసం చేశారు. జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి (సెబ్) జి.ప్రేమ్‌కాజల్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాన్ని ఎస్పీ సతీష్‌కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ కేవీ రాజేంద్రనాథ్‌రెడ్డి, రాష్ట్ర కమిషనర్ స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారి ఎం.రవిప్రకాష్ ఆదేశాల మేరకు జిల్లాలోని నాటు సారా బట్టీలపై, అక్రమ రవాణాకు పాల్పడుతున్న వారిపై నిఘా పెంచామన్నారు. ఇందులో భాగంగా ప్రత్తిపాడు, పిఠాపురం, పెద్దాపురం, తుని సెబ్ స్టేషన్ల పరిధిలో ముమ్మరంగా తనిఖీలు చేపట్టామన్నారు. ఈ తనిఖీలలో పట్టుబడిన సారాను ధ్వంసం చేశామని ఆయన తెలిపారు. సారా అక్రమ రవాణా, తయారీదారులపై ఇప్పటికే బైండోవర్ కేసులు నమోదు చేశామన్నారు. మరోసారి సారా విక్రయాలకు, అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన శిక్షలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ సీహెచ్ అజయ్‌కుమార్ సింగ్, పి.సునీల్‌కుమార్, ప్రత్తిపాడు సీఐ పందిరి అశోక్, ఐ.నాగవల్లి, కేవీ స్వామి, బి.శ్రీనివాసరావు, వీఆర్ఏలు ఉన్నారు.

ముచ్చటగా మూడో స్థానం

- ఇన్‌స్పైర్ మనక్ ఆవిష్కరణలకు 4,168 నామినేషన్లు
- రాష్ట్రంలో ఉమ్మడి తూర్పుగోదావరికి గుర్తింపు

రాయవరం: విద్యార్థుల్లో శాస్త్ర, సాంకేతిక అంశాలపై ఆసక్తి పెంచి వారితో సరికొత్త ఆవిష్కరణలు రూపొందించేలా డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ వారు ఏటా ఇన్‌స్పైర్ మనక్ విజ్ఞాన మేళాను నిర్వహిస్తున్నారు. ఆవిష్కరణల రూపకల్పనకు ప్రభుత్వం విద్యార్థులకు ప్రోత్సాహకంగా నగదును అందిస్తూనే రాష్ట్ర, జాతీయ స్థాయిలో విజేతలుగా నిలిచిన వారికి నగదు పారితోషికాలను అందజేస్తోంది. ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఇన్‌స్పైర్ మనక్ అవార్డుల కోసం ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్యాల పరిధిలోని పాఠశాలల నుంచి నామినేషన్లు ఆహ్వానించారు. ప్రాథమికోన్నత పాఠశాలల నుంచి గరిష్టంగా మూడు, ఉన్నత పాఠశాలల నుంచి గరిష్ఠంగా ఐదు నామినేషన్ల చొప్పున ఆహ్వానించారు. జూన్ నుంచి సెప్టెంబర్ 30వ తేదీ వరకూ విద్యార్థుల నుంచి నామినేషన్లు స్వీకరించారు. ఉమ్మడి జిల్లాలోని 2,145 ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల నుంచి 4,168 నామినేషన్లను ఆయా పాఠశాలల యాజమాన్యాలు ఆన్‌లైన్‌లో సబ్మిట్ చేశారు. గత విద్యా సంవత్సరంలో 4,035 నామినేషన్లు రాగా, ఈ ఏడాది 133 నామినేషన్లు అధికంగా వచ్చాయి. ప్రాజెక్టుల రూపకల్పనలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా రాష్ట్ర వ్యాప్తంగా మూడో స్థానంలో నిలిచింది. గత విద్యా సంవత్సరంలో రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలవడం గమనార్హం. పదేళ్లగా మొదటి మూడు స్థానాల్లో ఏదో ఒక స్థానంలో నిలుస్తోంది.

ఎంపికైన ప్రాజెక్టుకు రూ.10 వేలు

జిల్లాలో 6–10 తరగతి చదువుతున్న ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల విద్యార్థులు నూతన ఆలోచనలతో సృజనాత్మక ఆవిష్కరణలు రూపొందించాలి. నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ ఎంపిక చేసిన వినూత్న ఆలోచనలు కలిగిన ప్రాజెక్టుకు రూ.10 వేల నగదును విద్యార్థి ఖాతాలో జమ చేస్తారు. ప్రాజెక్టు తయారీ, జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ మనక్ ప్రదర్శనలో పాల్గొనేందుకు వీటిని ఖర్చు చేయాల్సి ఉంది. 2022–23 విద్యా సంవత్సరానికి సంబంధించిన జిల్లా ఇన్‌స్పైర్ మనక్‌ను నవంబర్‌లో ఉమ్మడి జిల్లా కేంద్రం కాకినాడలో ఏర్పాటు చేయనున్నట్లు సమాచారం. గత విద్యా సంవత్సరానికి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 302 ప్రాజెక్టులు ఇన్‌స్పైర్ మనక్‌కు ఎంపికయ్యాయి. ఎంపికైన ప్రాజెక్టుల వివరాలను ఇప్పటికే ఆయా పాఠశాలలకు జిల్లా విద్యాశాఖ తెలియజేసింది. త్వరలో ఏర్పాటు చేసే జిల్లా స్థాయి మనక్‌లో ఎంపికైన ప్రాజెక్టులను విద్యార్థులు సిద్ధం చేసుకుని ప్రదర్శించాల్సి ఉంది.

ఇదే స్ఫూర్తి కొనసాగించాలి



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 368 ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల నుంచి 1,626 నామినేషన్లు దాఖలు చేశారు. జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలల ఉపాధ్యాయులు ఇన్‌స్పైర్ మనక్ ఆవిష్కరణలకు మంచి స్పందన కనబర్చారు. నూతన ఆవిష్కరణలు రూపొందించేలా విద్యార్థులను ప్రోత్సహించారు. ఇదే స్ఫూర్తిని ముప్ముందు కొనసాగించాలి.

– జీవీఎస్ సుబ్రహ్మణ్యం, జిల్లా సైన్స్ అధికారి, అమలాపురం

త్వరలో ప్రదర్శనకు చర్యలు



ఇన్‌స్పైర్ మనక్ నామినేషన్ల విషయంలో జిల్లా రాష్ట్ర స్థాయిలో మూడో స్థానంలో స్థానంలో నిలవడం సంతోషించదగ్గ విషయం. విద్యార్థులను ప్రోత్సహించిన ఉపాధ్యాయులకు అభినందనలు. త్వరలోనే 2022–23 జిల్లా ఇన్‌స్పైర్ ప్రదర్శనను ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడతాం. ఎప్పుడు చేసేదీ త్వరలో ఆయా పాఠశాలలకు తెలియజేస్తాం.

–జి.నాగమణి, ఆర్జేడీ, పాఠశాల విద్యాశాఖ, కాకినాడ

కొబ్బరి చెక్కల వేలం ఖరారు

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరస్వామికి మొక్కుబడిగా సమర్పించిన కొబ్బరి చెక్కలను సంవత్సరం పాటు సేకరించుకునేందుకు గురువారం దేవాదాయ శాఖ అధికారులు బహిరంగ వేలం నిర్వహించారు. నవంబర్ 16 నుంచి నుంచి సంవత్సరం పాటు కొబ్బరి చెక్కలు తీసుకొనుటకు ఆలయ చైర్మన్ గుత్తుల నాగబాబు పర్యవేక్షణలో బహిరంగ వేలం నిర్వహించారు. పోల్నాటి నాగ వెంకట రమణ రూ.44,55,000కు దక్కించుకున్నారు.

హార్దిక్ పాండ్యాకు గాయం



ప్రపంచకప్ వేటలో ఉన్న భారత శిబిరంలో కాస్త ఆందోళన పెంచే ఘటన మైదానంలో జరిగింది. బంగ్లాతో మ్యాచ్‌లో బౌలింగ్ చేస్తూ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా గాయపడ్డాడు. తన తొలి ఓవర్ మూడో బంతిని బ్యాటర్ దాస్ నేరుగా ఆడగా బంతిని ఆపే ప్రయత్నంలో పాండ్యా తన కాలును బాగా ముందుకు జరిపాడు. ఈ క్రమంలో అతని చీలమండ భాగం మడత పడింది. దాంతో అతను నొప్పితో విలవిల్లాడాడు. ప్రాథమిక చికిత్స చేసినా లాభం లేకపోవడంతో అలాగే మైదానం వీడాడు. కొద్ది సేపటికే ఈ మ్యాచ్‌లో అతను బౌలింగ్ చేయడని బీసీసీఐ ప్రకటించింది. అతని కాలికి స్కాన్ నిర్వహించినట్లు తెలిసింది. దాని ఫలితాలపై పూర్తి సమాచారం లేకున్నా మ్యాచ్ తర్వాత రోహిత్ 'పెద్దగా ప్రమాదం ఏమీ లేకపోవడం మాకు ఊరట. అయితే ప్రతీ రోజు గాయాన్ని వైద్యులు పర్యవేక్షిస్తారు' అని స్పష్టతనిచ్చాడు. పాండ్యా తప్పుకోవడంతో ఆ ఓవర్లో మిగిలిన మూడు బంతులను కోహ్లి బౌల్ చేయడంతో స్టేడియం హోరెత్తింది. దీనికి ముందు 2017లో శ్రీలంకపై చివరిసారిగా కోహ్లి బౌలింగ్ చేశాడు.

నాలుగోసారీ ఛేదించాం

మళ్లీ అదే వ్యూహం... అదే ఫలితం... పదునైన బౌలింగ్‌తో ప్రత్యర్థిని తక్కువ స్కోరుకే కట్టడి చేయడం... ఆపై మెరుపు బ్యాటింగ్‌తో వేగంగా విజయాన్నందుకోవడం... 199, 272, 191, 256... ఇలా ప్రత్యర్థి స్కోర్లు మారడమే తప్ప భారత జట్టు ఆట మారలేదు... సమష్టి ప్రదర్శనతో సొంతగడ్డపై ప్రపంచకప్‌లో భారత్ జైత్రయాత్ర కొనసాగుతుంది... వరుసగా నాలుగో మ్యాచ్‌లోనూ సంపూర్ణ ఆధిపత్యం ప్రదర్శించిన టీమిండియా తమ విజయాల స్కోరును 4/4గా మార్చుకుంది... బలహీన ప్రత్యర్థి బంగ్లాదేశ్‌పై సులువైన విజయంతో రోహిత్ బృందం సత్తా చాటింది. బౌలర్లు చెలరేగడంతో బంగ్లాదేశ్ నామమాత్రపు స్కోరుకు పరిమితం కాగా... రోహిత్, గిల్, కోహ్లి బ్యాటింగ్‌తో అలవోకగా భారత జట్టు లక్ష్యం చేరింది... చిన్నపాటి లక్ష్యంలో కూడా చివర్లో చెలరేగి కోహ్లి 48వ వన్డే సెంచరీని తన ఖాతాలో వేసుకోవడం మ్యాచ్‌లో హైలైట్.

48 వన్డేల్లో కోహ్లి సెంచరీల సంఖ్య. ఈ ఫార్మాట్‌లో అత్యధిక సెంచరీలు చేసిన ప్లేయర్‌గా సచిన్ టెండూల్కర్ (49) పేరిట ఉన్న రికార్డును సమం చేసేందుకు కోహ్లి మరో సెంచరీ దూరంలో ఉన్నాడు. రోహిత్ (31) మూడో స్థానంలో ఉన్నాడు.

4 వన్డే వరల్డ్‌కప్ చరిత్రలో ఓ మ్యాచ్‌లో భారత జట్టుపై ఓపెనర్లిద్దరూ అర్ధ సెంచరీలు/సెంచరీలు చేయడం ఇది నాలుగోసారి మాత్రమే. ప్రత్యర్థి జట్టు ఓపెనర్లు హాఫ్ సెంచరీలు/సెంచరీలు చేసిన మూడు మ్యాచ్‌ల్లో భారత జట్టు ఓటమి చెందగా... నాలుగోసారి మాత్రం భారత్ గెలిచింది.

ప్రపంచకప్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే.
న్యూజిలాండ్	4	4	0	8	1.923
భారత్	4	4	0	8	1.659
దక్షిణాఫ్రికా	3	2	1	4	1.385
పాకిస్తాన్	3	2	1	4	-0.137
ఇంగ్లండ్	3	1	2	2	-0.084
ఆస్ట్రేలియా	3	1	2	2	-0.734
బంగ్లాదేశ్	4	1	3	2	-0.784
నెదర్లాండ్స్	3	1	2	2	-0.993
అఫ్గానిస్తాన్	4	1	3	2	-1.250
శ్రీలంక	3	0	3	0	-1.532

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

ప్రపంచకప్‌లో నేడు

ఆస్ట్రేలియా X పాకిస్తాన్
వేదిక: బెంగళూరు
మధ్యాహ్నం 2 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, హాట్‌స్టార్ యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

ప్రపంచకప్‌లో భారత్‌కు మరో విజయం

7 వికెట్లతో బంగ్లాదేశ్ చిత్తు ● విరాట్ కోహ్లి 48వ వన్డే శతకం
రాణించిన గిల్, రోహిత్, బౌలర్లు ● ఆదివారం న్యూజిలాండ్‌తో తర్వాతి మ్యాచ్



గిల్



రోహిత్

పుణే: తిరుగులేని ప్రదర్శనతో భారత్ వరల్డ్‌కప్‌లో మరో గెలుపును తమ ఖాతాలో వేసుకుంది. గురువారం జరిగిన పోరులో భారత్ 7 వికెట్ల తేడాతో బంగ్లాదేశ్‌ను చిత్తు చేసింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న బంగ్లాదేశ్ 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 256 పరుగులు చేసింది. లిటన్ దాస్ (82 బంతుల్లో 66; 7 ఫోర్లు), తన్‌జీద్ హసన్ (43 బంతుల్లో 51; 5 ఫోర్లు, 3 సిక్స్‌లు), మహ్మదుల్లా (36 బంతుల్లో 46; 3 ఫోర్లు, 3 సిక్స్‌లు) జట్టు స్కోరులో కీలకపాత్ర పోషించారు. అనంతరం భారత్ 41.3 ఓవర్లలో 3 వికెట్లకు 261 పరుగులు చేసి గెలిచింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' విరాట్ కోహ్లి (97 బంతుల్లో 103 నాటౌట్; 6 ఫోర్లు, 4 సిక్సర్లు) సెంచరీ సాధించగా... గిల్ (55 బంతుల్లో 53; 5 ఫోర్లు, 2 సిక్సర్లు), రోహిత్ శర్మ (40 బంతుల్లో 48; 7 ఫోర్లు, 2 సిక్స్‌లు) చెలరేగారు. భారత్ ఆదివారం జరిగే తమ తర్వాతి పోరులో ధర్మశాలలో న్యూజిలాండ్‌తో తలపడుతుంది.

ఓపెనర్ల జోరు...

బంగ్లాకు ఓపెనర్లు తన్‌జీద్, దాస్ శుభారంభం అందించారు. భారత బౌలర్లను సమర్థంగా ఎదుర్కొంటూ వీరిద్దరు చక్కటి బ్యాటింగ్ ప్రదర్శన కనబర్చారు. శార్దుల్ తొలి ఓవర్లో తన్‌జీద్ వరుసగా 6, 4, 6 బాదడంతో 10 ఓవర్లు ముగిసేసరికి స్కోరు 63 పరుగులకు చేరింది. ఈ క్రమంలో 41 బంతుల్లో తన్‌జీద్ అర్ధసెంచరీ పూర్తయింది. అయితే అతడిని వికెట్ల ముందు దొరకబుచ్చుకొని కుల్దీప్ భారీ భాగస్వామ్యానికి ముగింపు పలికాడు. అంతే...ఆ తర్వాత బంగ్లా బ్యాటర్లు ఒకరి తర్వాత మరొకరు వరుసగా విఫలమయ్యారు. 93/0తో ఒకదశలో పటిష్ట స్థితిలో కనిపించిన జట్టు వేగంగా వికెట్లు కోల్పోయింది. నజ్ముల్ (8), మిరాజ్ (3) తక్కువ వ్యవధిలో వెనుదిరగ్గా... 62 బంతుల్లో హాఫ్ సెంచరీని అందుకున్న దాస్ వీరిని అనుసరించాడు. తౌహీద్ (16) బంతులు వృథా చేయగా, ముష్ఫికర్ రహీమ్ (46 బంతుల్లో 38; 1 ఫోర్, 1 సిక్స్) జట్టును ఆదుకునే ప్రయత్నం చేశాడు. అయితే మన పటిష్ట బౌలింగ్‌లో పరుగులు రాబట్టడం కష్టంగా మారింది. చివర్లో మహ్మదుల్లా ధాటిగా ఆడటంతో బంగ్లా ఈ మాత్రం స్కోరైనా చేయగలిగింది. గాయం కారణంగా కెప్టెన్ షకీబ్ అల్ హసన్, ప్రధాన పేసర్ తస్కీన్ అహ్మద్ ఈ మ్యాచ్‌కు దూరం కావడంతో ఆట ఆరంభానికి ముందే బంగ్లా బలహీన పడింది.

కీలక భాగస్వామ్యాలు...

ఛేదనలో ఎప్పటిలాగే రోహిత్ తనదైన శైలిలో దూకుడు చూపిస్తూ వరుస బౌండరీలతో దూసుకుపోయాడు. మరో వైపు నసుమ్ ఓవర్లో 2 సిక్స్‌లతో జోరు పెంచిన గిల్... ముస్తఫిజుర్ ఓవర్లో మూడు ఫోర్లు బాదాడు. అయితే హసన్ ఓవర్లో భారీ సిక్స్ కొట్టిన రోహిత్ తర్వాతి బంతికి అదే తరహా షాట్ ఆడబోయి వెనుదిరగడంతో భారత్ తొలి వికెట్ కోల్పోయింది. ఆ తర్వాత కోహ్లి బాధ్యత తీసుకోగా... 52 బంతుల్లో అర్ధ సెంచరీ చేసిన తర్వాత గిల్ నిష్క్రమించాడు. చూడచక్కటి షాట్లు ఆడిన కోహ్లి 48 బంతుల్లోనే హాఫ్ సెంచరీ మార్క్‌ను అందుకున్నాడు. శ్రేయస్ అయ్యర్ (25 బంతుల్లో 19; 2 ఫోర్లు) ఎక్కువసేపు నిలవలేకపోగా... కోహ్లి, కేఎల్ రాహుల్ (34 బంతుల్లో 34 నాటౌట్; 3 ఫోర్లు, 1 సిక్స్) భాగస్వామ్యం జట్టును గెలుపు దిశగా నడిపించింది. వీరిద్దరు స్వేచ్ఛగా బ్యాటింగ్ చేయగా, వీరిని నిలువరించలేక బంగ్లా బౌలర్లు చేతులెత్తేశారు.

సెంచరీ దిశగా ఉత్కంఠ!

బ్యాటింగ్‌లో భారత్ జోరు చూస్తే జట్టు విజయంపై ఎలాంటి సందేహాలు లేవు. అయితే కోహ్లి శతకం చేరుకునే ప్రయత్నం చేయడమే చివర్లో ఆటను కాస్త ఆసక్తికరంగా మార్చింది. 36 ఓవర్ల తర్వాత జట్టు విజయానికి 48 పరుగులు కావాల్సి ఉండగా... కోహ్లి 68 పరుగుల వద్ద ఉన్నాడు. తర్వాతి ఓవర్లో రాహుల్ 6, 4 సహా 12 పరుగులు చేయడంతో ఈ అంతరం మరింత తగ్గింది. మరుసటి ఓవర్ తర్వాత భారత్‌కు 28 పరుగులు, కోహ్లి సెంచరీకి 27 పరుగులు కావాలి. ఇద్దరు ప్రధాన బ్యాటర్లు క్రీజ్‌లో ఉంటే ఒక్కడే పరుగులు చేయడం దాదాపుగా జరగదు. కానీ తగినన్ని ఓవర్లు అందుబాటులో ఉండటంతో సమస్య లేదు కాబట్టి ఈ దశలో కోహ్లి సెంచరీపై దృష్టి పెట్టాడు. రాహుల్ కూడా పరుగులు చేయకుండా వెనక్కి తగ్గాడు. సింగిల్స్ తీసే అవకాశమున్నా దానిని బ్యాటర్లు కాదనుకున్నారు. ఫలితంగా కోహ్లికి శతకం సాధ్యమైంది. తర్వాతి 32 పరుగుల్లో కోహ్లి ఒక్కడే 30 పరుగులు సాధించగా రాహుల్ సింగిల్ మాత్రమే తీశాడు. మరో పరుగు వైడ్ రూపంలో వచ్చింది. నసుమ్ వేసిన ఫుల్‌టాస్ బంతిని డీప్ మిడ్ వికెట్ మీదుగా సిక్సర్ బాది విరాట్ శతక గర్జన చేశాడు.



కోహ్లి

స్కోరు వివరాలు

బంగ్లాదేశ్ ఇన్నింగ్స్: తన్‌జీద్ (ఎల్బీ) (బి) కుల్దీప్ 51; లిటన్ దాస్ (సి) గిల్ (బి) జడేజా 66; నజ్ముల్ (ఎల్బీ) (బి) జడేజా 8; మిరాజ్ (సి) రాహుల్ (బి) సిరాజ్ 3; తౌహీద్ (సి) గిల్ (బి) శార్దుల్ 16; ముష్ఫికర్ (సి) జడేజా (బి) బుమ్రా 38; మహ్మదుల్లా (బి) బుమ్రా 46; నసుమ్ (సి) రాహుల్ (బి) సిరాజ్ 14; ముస్తఫిజుర్ (నాటౌట్) 1; షరీఫుల్ (నాటౌట్) 7; ఎక్స్‌ట్రాలు 6; **మొత్తం (50 ఓవర్లలో 8 వికెట్లకు) 256. వికెట్ల పతనం:** 1-93, 2-110, 3-129, 4-137, 5-179, 6-201, 7-233, 8-248. **బౌలింగ్:** బుమ్రా 10-1-41-2, సిరాజ్ 10-0-60-2, పాండ్యా 0.3-0-8-0, కోహ్లి 0.3-0-2-0, శార్దుల్ 9-0-59-1, కుల్దీప్ 10-0-47-1, జడేజా 10-0-38-2.

భారత్ ఇన్నింగ్స్: రోహిత్ (సి) తౌహీద్ (బి) హసన్ 48; గిల్ (సి) మహ్మదుల్లా (బి) మిరాజ్ 53; కోహ్లి (నాటౌట్) 103; అయ్యర్ (సి) మహ్మదుల్లా (బి) మిరాజ్ 19; రాహుల్ (నాటౌట్) 34; ఎక్స్‌ట్రాలు 4; **మొత్తం (41.3 ఓవర్లలో 3 వికెట్లకు) 261. వికెట్ల పతనం:** 1-88, 2-132, 3-178. **బౌలింగ్:** షరీఫుల్ 8-0-54-0, ముస్తఫిజుర్ 5-0-29-0, నసుమ్ 9.3-0-60-0, హసన్ 8-0-65-1, మిరాజ్ 10-0-47-2, మహ్మదుల్లా 1-0-6-0.

ఇక ఆసీస్‌తో ప్రమాదం

కృష్ణమాచారి శ్రీకాంత్

వరుస పరాజయాల అనంతరం ఆస్ట్రేలియా జట్టు ఎట్టకేలకు శ్రీలంకపై చక్కని విజయంతో ప్రపంచకప్‌లో బోణీ చేసింది. పట్టికలో చేరిన 2 పాయింట్లు ఆసీస్ శిబిరాన్ని సంబరంలో ముంచింది. ఓ కెప్టెన్ ముందుండి నడిపిస్తే దాని ప్రభావం జట్టుపై చాలా ఎక్కువగా ఉంటుంది. ఈ విషయం రోహిత్ శర్మ భారత్‌ను ఎలా విజయవంతగా నడిపిస్తున్నాడో చూస్తే అర్థమవుతుంది. ఆసీస్ కెప్టెన్ కమిన్స్ లయ అందుకోవడం, స్పిన్నర్ జంపా తిప్పేయడం తో 'కంగారూ జట్టు' ఇకపై ప్రమాదకర శక్తిగా మారుతుంది. ఇదే విషయం వారి గత ఐదు ప్రపంచకప్ టైటిళ్ల ఘనమైన రికార్డు సూచిస్తుంది. మార్ష్, లబుషేన్‌లతో పాటు స్మిత్ కూడా నిలకడగా ఆడితే బ్యాటింగ్ దళానికి తిరుగుండదు. డిఫెండింగ్ చాంపియన్ ఇంగ్లండ్‌కు అఫ్గాన్, దక్షిణాఫ్రికాకు నెదర్లాండ్స్ ఊహించని షాక్‌లు ఇచ్చాయి. ఇలా రోజుల వ్యవధిలోనే రెండు సంచలనాలు సెమీఫైనల్ బెర్త్‌ల రేసును రసవత్తరం చేస్తుందనడంలో అతిశయోక్తి లేదు. ముఖ్యంగా దక్షిణాఫ్రికాపై ఆఖరి పది ఓవర్లలో డచ్ బ్యాటర్లు చెలరేగిన వైనం, బౌలింగ్‌లో సఫారీపై విసిరిన పంజా అద్భుతం. ఇలాంటి పరాజయం నుంచి దక్షిణాఫ్రికా ఎలా పుంజుకుంటుందో చూడాలి. నేడు ఆస్ట్రేలియా, పాకిస్తాన్‌ల మధ్య ఆసక్తికర మ్యాచ్ జరగడం ఖాయం. ఎందుకంటే రెండు మ్యాచ్‌లు ఓడిన ఆసీస్ గెలుపుబాట పట్టగా, రెండు విజయాలు సాధించిన పాక్ ఓటమితో ఉంది. ఇలాంటి జట్ల మధ్య శుక్రవారం ఎవరు పైచేయి సాధిస్తారో చూడాలి. యువ బ్యాటర్లు షఫీక్, ఇమాముల్, షకీల్‌లతో పాటు సీనియర్లు బాబర్ ఆజమ్, రిజ్వాన్‌లు బ్యాట్ ఝుళిపిస్తే విజయం ఏమంత కష్టం కాదు. ఇక వేదిక గురించి చెప్పుకోవాల్సి వస్తే... బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో పరుగుల వరద ఖాయం. ఇది ఎన్నోసార్లు పరుగుల మజా పంచింది. అలాగే నాణ్యమైన బౌలింగ్ రుచి చూపిస్తే... కట్టడి చేయొచ్చని కూడా ఐపీఎల్‌లో యజువేంద్ర చహల్ నిరూపించాడు. ఈ నేపథ్యంలో ఎవరు మెరిపిస్తారో, ఎవరు కట్టడి చేస్తారో చూడాలి.

ఆసియా ఆర్చరీ పోటీలకు జ్యోతి సురేఖ, ధీరజ్





సోనీపత్: వచ్చే నెలలో బ్యాంకాక్‌లో జరిగే ఆసియా ఆర్చరీ చాంపియన్‌షిప్‌లో పాల్గొనే భారత పురుషుల, మహిళల రికర్వ్, కాంపౌండ్ జట్లను ప్రకటించారు. మహిళల కాంపౌండ్ జట్టులో స్టార్ ప్లేయర్, ఆసియా క్రీడల్లో మూడు స్వర్ణ పతకాలు గెలిచిన ఆంధ్రప్రదేశ్ అమ్మాయి వెన్నం జ్యోతి సురేఖ... పురుషుల రికర్వ్ జట్టులో ఆసియా క్రీడల్లో టీమ్ విభాగంలో రజత పతకం నెగ్గిన ఆంధ్రప్రదేశ్ ఆటగాడు ధీరజ్ బొమ్మదేవర ఎంపికయ్యారు. సర్వీసెస్ స్పోర్ట్స్ కంట్రోల్ బోర్డు (ఎస్ఎస్‌సీబీ)కు ప్రాతినిధ్యం వహించే ధీరజ్‌కు పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించేందుకు మరో అవకాశం దక్కింది. నవంబర్ 3 నుంచి 10 వరకు జరిగే ఆసియా చాంపియన్‌షిప్‌లో రికర్వ్ పురుషుల, మహిళల టీమ్ విభాగాల్లో స్వర్ణం గెలిచిన జట్లు... పురుషుల, మహిళల వ్యక్తిగత విభాగాల్లో ఫైనల్ చేరిన ఇద్దరు ప్లేయర్లు చొప్పున పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధిస్తారు.

హెచ్‌సీఏలో ఎన్నికల సందడి

నేడు పోలింగ్, ఫలితాలు ● 6 పదవుల కోసం బరిలో 24 మంది



అధ్యక్ష అభ్యర్థులు: అమర్‌నాథ్ | జగన్‌మోహన్ రావు | పీఎల్ శ్రీనివాస్ | అనిల్ కుమార్



సాక్షి, హైదరాబాద్: ఆర్థిక అవకతవకలు, అవినీతి, కోర్టు వివాదాలు, పరస్పర ఆరోపణలు, సస్పెన్షన్‌లు, పర్యవేక్షకుల పరిపాలన తర్వాత ఎట్టకేలకు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ)లో ఎన్నికలకు రంగం సిద్ధమైంది. రిటర్నింగ్ అధికారిగా రిటైర్డ్ ఐఏఎస్ అధికారి వీఎస్ సంపత్ ఆధ్వర్యంలో నేడు ఉప్పల్ స్టేడియంలో ఎన్నికలు జరుగుతాయి. వాస్తవానికి మొహమ్మద్ అజహరుద్దీన్ అధ్యక్షుడిగా 2019లో ఎన్నికైన హెచ్‌సీఏ కార్యవర్గం పదవీ కాలం గత ఏడాది సెప్టెంబర్ 26నే ముగిసింది. ఆ వెంటనే ఎన్నికలు జరగాల్సి ఉన్నా... వేర్వేరు వివాదాలతో అవి వాయిదా పడ్డాయి. చివరకు సుప్రీం కోర్టు జోక్యం చేసుకొని ఎన్నికలు జరిగే వరకు రోజూవారీ కార్యకలాపాల కోసం మాజీ న్యాయమూర్తి జస్టిస్ (రిటైర్డ్) ఎల్.నాగేశ్వరరావు నేతృత్వంలో ఏకసభ్య పర్యవేక్షణ కమిటీని నియమించింది. ఈ కమిటీ ఆధ్వర్యంలోనే హైదరాబాద్‌లో మూడు వరల్డ్‌కప్ మ్యాచ్‌లు కూడా జరిగాయి. చివరకు అక్టోబర్ 20న ఎన్నికలు నిర్వహించేందుకు నోటిఫికేషన్ విడుదలైంది. దీనికి ముందు హెచ్‌సీఏను ప్రక్షాళన చేసే క్రమంలో 57 క్లబ్‌లపై నాగేశ్వరరావు నిషేధం విధించారు. దాంతో ఈ క్లబ్‌లకు ఎన్నికల్లో ఓటు హక్కు లేకుండా పోయింది.

నాలుగు ప్యానెల్‌లుగా...

అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, కార్యదర్శి, సంయుక్త కార్యదర్శి, కోశాధికారి, కౌన్సిలర్... ఇలా ఆరు పదవుల కోసం ఎన్నికలు జరగనున్నాయి. లోధా కమిటీ సిఫారసులు, కొత్త నియమావళి కారణంగా గతంలో కీలక పదవులు నిర్వహించిన సీనియర్లందరూ ఈసారి పోటీలో లేకపోగా, తాము మద్దతు నిస్తూ సన్నిహితులను బరిలోకి దించారు. దాంతో ఈసారి ఎక్కువగా కొత్త మొహాలు కనిపిస్తున్నాయి. నాలుగు వేర్వేరు గ్రూప్‌లుగా విడిపోయి అభ్యర్థులంతా పోటీ చేస్తున్నారు. అయితే ఫలితం విషయంలో గ్రూప్‌లతో సంబంధం లేదు. ఒక్కో పదవి కోసం అత్యధిక ఓట్లు సాధించిన వారు ప్యానెల్‌తో సంబంధం లేకుండా ఎన్నికవుతారు. పోలింగ్ కోసం మొత్తం 173 ఓట్లు అందుబాటులో ఉన్నాయి. ఇందులో 101 రెగ్యులర్ క్రికెట్ క్లబ్‌లు కాగా 48 ఇన్‌స్టిట్యూషన్ క్లబ్‌లు ఉన్నాయి. 9 జిల్లా క్లబ్‌లతో పాటు 15 మందికి అంతర్జాతీయ ఆటగాళ్ల హోదాలో ఓటు హక్కు ఉంది. గెలిస్తే తాము హైదరాబాద్ క్రికెట్ సంఘాన్ని చక్కదిద్దుతామని, వివాదాలు లేకుండా నడిపిస్తామని అభ్యర్థులంతా హామీ ఇస్తున్నారు. శుక్రవారం సాయంత్రమే ఓట్లను లెక్కించి ఫలితాన్ని ప్రకటిస్తారు.

బరిలో ఉన్న ప్యానెల్, అభ్యర్థులు

యునైటెడ్ మెంబర్స్ ఆఫ్ హెచ్‌సీఏ: ఎ.జగన్‌మోహన్ రావు, పి.శ్రీధర్, ఆర్.హరినారాయణ రావు, నోయల్ డేవిడ్, సీజే శ్రీనివాస్, అన్సర్ అహ్మద్ ఖాన్. **క్రికెట్ ఫస్ట్:** అమర్‌నాథ్, జి.శ్రీనివాస రావు, ఆర్.దేవరాజ్, సి.సంజీవ్ రెడ్డి, చిట్టి శ్రీధర్, సునీల్ కుమార్. **ఆనెస్ట్ హార్డ్ వర్కింగ్ హెచ్‌సీఏ:** పీఎల్ శ్రీనివాస్, సి. బాబూరావు, ఆర్ఎం భాస్కర్, రోహిత్ అగర్వాల్, జెరార్డ్ కార్, డీఏజే వాల్టర్. **గుడ్ గవర్నెన్స్:** కె. అనిల్‌కుమార్, దల్జీత్ సింగ్, వి.ఆగమరావు, బసవరాజు, పి.మహేంద్ర, వినోద్ ఇంగ్లే.

హడలెత్తించిన రవితేజ

13 పరుగులిచ్చి 6 వికెట్లు తీసిన బౌలర్ ● హైదరాబాద్‌కు వరుసగా మూడో విజయం



జైపూర్: సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ దేశవాళీ టి20 క్రికెట్ టోర్నమెంట్‌లో హైదరాబాద్ జట్టు వరుసగా మూడో విజయం నమోదు చేసింది. ఛత్తీస్‌గఢ్‌తో గురువారం జరిగిన గ్రూప్ 'ఎ' లీగ్ మ్యాచ్‌లో తిలక్ వర్మ సారథ్యంలోని హైదరాబాద్ జట్టు ఆరు వికెట్ల తేడాతో నెగ్గింది. మొదట బ్యాటింగ్‌కు దిగిన ఛత్తీస్‌గఢ్ జట్టును హైదరాబాద్ మీడియం పేసర్ టి.రవితేజ హడలెత్తించాడు. రవితేజ కేవలం 13 పరుగులిచ్చి 6 వికెట్లు పడగొట్టాడు. సీవీ మిలింద్ (2/16), తనయ్ త్యాగరాజన్ (2/16) కూడా రాణించడంతో ఛత్తీస్‌గఢ్ 19.1 ఓవర్లలో 97 పరుగులకు ఆలౌటైంది. శశాంక్ సింగ్ (47 బంతుల్లో 51; 5 ఫోర్లు) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. అనంతరం హైదరాబాద్ 16 ఓవర్లలో 4 వికెట్లు నష్టపోయి 98 పరుగులు చేసి గెలిచింది. తన్మయ్ అగర్వాల్ (15 బంతుల్లో 21; 2 ఫోర్లు, 1 సిక్స్), రోహిత్ రాయుడు (10 బంతుల్లో 14; 2 ఫోర్లు, 1 సిక్స్), తిలక్ వర్మ (13 బంతుల్లో 11; 1 ఫోర్), చందన్ సహని (22 బంతుల్లో 25; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), రాహుల్ సింగ్ (33 బంతుల్లో 25 నాటౌట్) రాణించారు. హైదరాబాద్ తమ తదుపరి మ్యాచ్‌లో 21న మిజోరం జట్టుతో ఆడుతుంది.

షేక్ రషీద్ అజేయ శతకం

54 బంతుల్లో 10 ఫోర్లు, 6 సిక్స్‌లతో 100 నాటౌట్ ● అరుణాచల్ ప్రదేశ్‌పై ఆంధ్ర గెలుపు



రాంచీ: సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ దేశవాళీ టి20 క్రికెట్ టోర్నమెంట్‌లో ఆంధ్ర జట్టు తొలి విజయం నమోదు చేసింది. అరుణాచల్ ప్రదేశ్ జట్టుతో జరిగిన గ్రూప్ 'సి' మ్యాచ్‌లో ఆంధ్ర 145 పరుగుల తేడాతో నెగ్గింది. తొలుత ఆంధ్ర జట్టు 20 ఓవర్లలో 4 వికెట్లకు 228 పరుగులు చేసింది. షేక్ రషీద్ (54 బంతుల్లో 100 నాటౌట్; 10 ఫోర్లు, 6 సిక్స్‌లు) అరుణాచల్ బౌలర్లపై విరుచుకుపడి అజేయ సెంచరీ చేశాడు. హనుమ విహారి (32 బంతుల్లో 49; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధ సెంచరీని చేజార్చుకున్నాడు. రికీ భుయ్ (10 బంతుల్లో 27; 1 ఫోర్, 3 సిక్స్‌లు), కరణ్ షిండే (8 బంతుల్లో 23 నాటౌట్; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) కూడా ధాటిగా ఆడారు. 229 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన అరుణాచల్ ప్రదేశ్ జట్టు 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 83 పరుగులు చేసి ఓడిపోయింది. ఆంధ్ర జట్టు బౌలర్లలో స్టీఫెన్ (3/10), కేవీ శశికాంత్ (2/2) రాణించారు. ఆంధ్ర తమ తదుపరి మ్యాచ్‌ను ఈనెల 21న గుజరాత్‌తో ఆడుతుంది.

క్వార్టర్స్‌లో సింధు



ఒడెన్స్: డెన్మార్క్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-750 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో భారత స్టార్ పీవీ సింధు క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. గురువారం జరిగిన మహిళల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో ప్రపంచ 12వ ర్యాంకర్ సింధు 18-21, 21-15, 21-13తో ప్రపంచ ఏడో ర్యాంకర్ గ్రెగోరియా మరిస్కా టున్‌జుంగ్ (ఇండోనేసియా)పై గెలుపొందింది. మరో మ్యాచ్‌లో భారత్‌కే చెందిన ఆకర్షి కశ్యప్ 18-21, 8-21తో సుపనిద కటెథోంగ్ (థాయ్‌లాండ్) చేతిలో ఓడిపోయింది.

డిసెంబర్ 2 నుంచి పీకేఎల్

ముంబై: ప్రో కబడ్డీ లీగ్ (పీకేఎల్) పదో సీజన్ షెడ్యూల్‌ను నిర్వాహకులు ప్రకటించారు. అహ్మదాబాద్‌లో డిసెంబర్ 2న గుజరాత్ జెయింట్స్, తెలుగు టైటాన్స్ మ్యాచ్‌తో పీకేఎల్ మొదలవుతుంది. ఈసారి పీకేఎల్ మ్యాచ్‌లు 12 జట్ల నగరాల్లో జరుగుతాయి. వచ్చే ఏడాది ఫిబ్రవరి 21తో లీగ్ దశ ముగుస్తుంది. ప్లే ఆఫ్ మ్యాచ్‌ల షెడ్యూల్‌ను తర్వాత ప్రకటిస్తారు. హైదరాబాద్ అంచె పోటీలు జనవరి 19 నుంచి 24 వరకు జరుగుతాయి. డిఫెండింగ్ చాంపియన్స్‌గా జైపూర్ పింక్ పాంథర్స్ జట్టు బరిలో దిగుతున్న ఈ లీగ్‌లో బెంగాల్ వారియర్స్, బెంగళూరు బుల్స్, దబంగ్ ఢిల్లీ, గుజరాత్ జెయింట్స్, హరియాణా స్టీలర్స్, పట్నా పైరేట్స్, పుణేరి పల్టన్, తమిళ్ తలైవాస్, తెలుగు టైటాన్స్, యు ముంబా, యూపీ యోధాస్ జట్లు కూడా తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటాయి.